# బియ్యపురుగులు

**-డి. ఆర్. ఇంద్ర**

ఆలీశం! ఆలీశవైపోతోంది!

ఎంత త్వరగా తెవుల్చుకుందావనుకున్నా తెవలని, తరగని, నడ్డివిరిచే అంతులేని చాకిరీ! అంట్లు తోమీతోమీ చేతులు అరిగి ఎఱ్ఱబారుతున్నాయేగానీ అంట్లు తరగడంలేదు. ప్రాణాలుగ్గబట్టి తోముతోంది సీతాలు. ఇంకో రెండు గిన్నెలు తోమితే అయిపోయినట్లే అనుకునేసరికి, ఇంటి కోడలు ఇడ్డెన్లు తిన్న ప్లేట్లూ, కాఫీ గ్లాసులూ తీసుకొచ్చిపడేసింది. ప్రాణం వుసూరుమంది సీతాలుకి. భారీ సైజు పింగాణీ ప్లేట్లు అవి. ఒక్కటి చెయ్యి జారిందా ఈ నెల జీతం గోవిందా. ఆ ప్లేట్లులాగే ఆ కోడలూ భారీసైజే. రోడ్లు వూడ్చే మున్సిపాలిటీ పనివాళ్ళు పదిరోజులు సమ్మె చేస్తే తుక్కుతో నిండి వుబ్బిపోయిన సిమెంటు గోలెంలా ఉంటుందా కుఱ్ఱ ఇల్లాలు.



"ఏమే కుఱ్ఱముండా! బెడ్రూమ్స్‌కి తడిగుడ్డ పెట్టడం అయిందటే?" శేరుచెంబులాంటి మగ్గుతో కాఫీ తాగుతూ అరిచింది ఇంటావిడ మాణిక్యాంబ. సీతాలు తొమ్మిదేళ్ళ కూతురు దుర్గని ఉద్దేశించి. "...అ... అ... అవుతోందండి!" మోకాళ్ళమీద కూర్చుని గచ్చుని బలంగా తడిగుడ్డతో పాముతూ భయంగా చెప్పింది దుర్గ. మాణిక్యాంబ గొంతు వింటేనే దుర్గకి గుండెదడ పట్టుకుంటుంది. మాణిక్యాంబ సినీమా సూర్యకాంతంలా కొంచెం లావుగా వుండదు. బొగ్గు రైలింజన్‌కి చీరచుట్టినట్టూ, ఏక కాలంలో రెండు రైళ్ళు రావడానికీ, పోడానికీ సరిపడ విశాలంగా కట్టిన రైలు బ్రిడ్జిలా వుంటుంది. ఆవిడ ఇంట్లో నడుస్తూంటే గదుల్లోని చిన్న సామాన్లు అల్లల్లాడుతుంటాయి.

మాణిక్యాంబకి సీతాలుమీదా, దుర్గమీదా చాలా కోపంగా వుంది. యజమానులు ధుమధుమలాడుతూంటేనేగాని పనిమనుషులు చురుగ్గానూ, త్వరగానూ పన్చేయరని ఆవిడ గాఢ విశ్వాసం. పేరుకి ఇద్దరు పనిమనుషులున్నా ఒక్క పనీ టైముకి తెమిల్చి చావదు. అసలే ఆలస్యం అయిపోతోంది. ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరైన మొగుడు స్కూలుకి వెళ్ళడానికి టైమైపోతోంది. ఆయన పూజ అయ్యేసరికి టిఫినూ, భోజనం కేరియరూ రెడీ అయిపోవాలి. "బిళ్ళ కుడుంలా నెలకి వంద రూపాయలు తీసుకునే పనిమనుషులకి పని సక్రమంగా చేద్దామనే నిజాయితీ ఉండదు, అలగా మనుషులూ, అలగా బుద్ధులూనూ!" సీతాలుకి వినిపించేలాగే విసుక్కుంది మాణిక్యాంబ.

గంట గణగణమని మోగింది పూజగదిలోంచి. "నా పూజ ఐపోయిందోయ్, నీదే ఆలస్యం!" కేక పెట్టాడు రామనాథం వడపప్పూ, బెల్లం ముక్కా ప్రసాదాన్ని భార్యకి అందివ్వడానికి లేస్తూ. నుదుట విభూతిరేకలూ, చెవుల్లో పువ్వులూ, పట్టు పంచెతో ఉన్న ఆయన్ని పెద్ద మనిషి అనక మరోలా అనడం భావ్యం కాదు. ఆయన భార్యలా భారీగా వుండడు. సాదాసీదాతనం ఉట్టిపడేట్టుంటాడు. కొంచెం డబ్బున్న వాడిలా కనిపిస్తే మున్సిపాలిటీ వాళ్ళు ఇంటిపన్ను ఎక్కువేస్తారేమోనని కావాలని కొంచెం చిరుగుల పంచె కట్టే తెలివైన ఇంటివోనర్‌లా ఉంటాడు.

మంచీ మర్యాదా తెలిసున్న మంచి హెడ్మాస్టరులా వుంటాడు. నిద్రిస్తూన్న పిన్తల్లి గర్భంలో ప్రవేశించి లోపలి శిశువుని ఏడవకని వోదారుస్తూ వజ్రాయుధంతో ముక్కలుగా నరికి బయటకొచ్చి పిన్తల్లికి వినయంగా నమస్కరించిన ఇంద్రుడిలా బుద్ధిమంతుడులా ఉంటాడు.

"ఆలీశం! ఆలీశమైపోతోంది మాణిక్యం! ఈరోజు స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్ విజిట్‌కి రావచ్చు కేరియర్ సర్దడవైందా? త్వరగా సర్దు." పట్టుపంచెలోంచి స్కూలు పంచెలోకి మారుతూ చెప్పాడు.

"ఆ!.. ఈ సీతాలు ఏ రోజున పని తెవిల్చింది కనుక... ఏవే, కారియర్ తోవడం అయిందా?" అది తోవడం అయి పావుగంట అయిందని తెలిసీ అరిచింది రైలుబ్రిడ్జి. ఆ అరవడం ఒకటే ఆవిడచేసే ఫిజికల్ ఎక్సర్‌సైజ్. సీతాలు జవాబివ్వకుండా ఇడ్డెన్ల ప్లేటు కడుగుతోంది.

దొడ్లో పెద్ద సౌండ్‌తో రేడియోలోంచి భక్తి సంగీతం వస్తోంది. తామెంత భక్తి తత్పరులో ఇరుగు పొరుక్కి తెలిసేలా రేడియో తీసుకొచ్చి దొడ్లో పెద్ద సౌండ్‌తో పెడతాడు రామనాథం. ప్రశాంతంగా పనిచేసుకోనివ్వకుండా ఈ గోలేవిటనిపిస్తుంది సీతాలుకి. ఎవరో బొంగురు గొంతుతో – "విడువరాదు భగవంతుని భజన ఘడియు కాలమ్మైనా... మరువరాదు భగవన్నామము..." అంటూ పాడుతోంది.

"విడువరాదు ఈ అంట్లు ఒక్కపూట అయినా, మరువరాదు మాణిక్యాంబ తిట్లు మరుజన్మకైనా' అనిపించింది సీతాలుకి. పొద్దుటే ఏవీ తినకుండా, తాగకుండా బండెడు అంట్లు తోమేసరికి ఆయాసం వస్తోంది. తనకే ఇలా కడుపులో మాడ్తూ చచ్చేంత నీర్సంగా వుంటే కుర్రముండ దుర్గకి ఇంకెంత నీర్సంగా ఉంటుందో తనకి తెల్సినా తను చేయగలిగిందేవీ లేదు. ఆకల్తో మాడే తల్లిని చూసి అదీ ఆకలిని దాచుకోవడం నేర్చుకుంది. అదెంత చురుగ్గా పన్జేస్తూన్నా దాన్నీ సాధించడం మానరు. ఇడ్డెన్ల రేకులు తోముతూంటే వాటికి అంటుకున్న తునకల్ని గీకి కూతురికి పెట్టాలనిపిస్తుంది కానీ ఆ పని చేయడానికి అభిమానం అడ్డొస్తుంది. తనకి పెట్టకపోయినా చచ్చే చాకిరీ చేసే ఆ కుర్రముండకైనా ఒక్క ఇడ్లీ పెట్టడానికి కూడా ఇంట్లో వాళ్ళకి చేతులు రావు. పనికి కుదిరేముందే మాటాడుకున్న జీతం తప్ప కాఫీ, టిఫెన్లు పెట్టడం కుదర్దని మాణిక్యాంబ నిక్కచ్చిగా చెప్పింది. వాళ్ళకి పనిమనిషి అవసరం కన్నా ఆ వంద రూపాయల జీతం తనకి ఎన్నోరెట్లు ఎక్కువ అవసరం. నాలుగిళ్ళల్లో అంట్లు తోమి పొట్టపోసుకోవాల్సిన ఖర్మం తనది. ఇస్తానన్న జీతానికే వొప్పుకోక ఏం చేస్తుంది? గొప్పోళ్ళకి జాలీ వోలీ ఉండాలని ఆశించడం తన తప్పు.

ఆలీశం, ఆలీశవైపోతోంది బడికెల్డానికి అనుకుంటూ మాటిమాటికి హాల్లోని గోడ గడియారం వంక చూస్తూనే మోకాళ్ళు అరిగేలా పాకుతూ గచ్చు తడిగుడ్డతో తుడుస్తోంది దుర్గ. అదీ రామనాథం పన్చేసే స్కూల్లోనే నాలుగో తరగతి చదువుతోంది. ఏనాడూ స్కూలు ముఖం ఎరగని సీతాలుకి దుర్గనైనా పదో తరగతి వరకైనా చదివించాలని ఆశ. తనకితోడుగా పన్లోకి రావద్దనీ, బడికి పొమ్మనీ కసురుతుంది. రావద్దని అన్నప్పటికీ, అది రాకపోతే మొత్తం పనంతా తనొక్కర్తే చేసుకోలేదనీ తెలుసు. కుర్రది కూడా పన్జేస్తోంది కదా అని దానికేమీ రూపాయి చేతిలో పెట్టరు. దాన్ని బడికెళ్ళేటైంకి వొదిలెయ్యమంటే అత్తాకోడళ్ళకెంత మంటో! అదేవన్నా చదివి ఇందిరాగాంధీలా దేశాలేలాలా అని వోసారి వెటకారించింది మాణిక్యాంబ. తన మనవల్ని పెద్దింగ్లీసు బళ్ళో సదివించడవెందుకో అడుగుదావా అనుకునీ ఆవిడతో మాటాడ్డం యిష్టం లేక మానుకుంది. టైంకి బడికెళ్ళాలని పిల్ల తపన. ఇక వెళ్ళు అనే ముక్క అత్తాకోడళ్ళ నోటమ్మట రాదు. ఇంకా ఏం పని ఉందా చెప్పటానికి అని చూస్తారు. రామనాథం సైకిల్ బైటికి తీసిన చప్పుడు వినిపించి ఉలిక్కిపడింది దుర్గ. తను అరగంట నడిస్తేగానీ స్కూలుకి చేరుకోలేదు. ఇంకా తుడవాల్సిన గదులున్నాయి. లంకంత కొంప! ఈరోజు టైంకి తను బడికెళ్ళలేదు. తనకి ఆజరీ పడదు. ఆజరీ లేకపోతే తనలాటి పేదపిల్లలకిచ్చే మూడు కేజీల బియ్యవూ ఇవ్వరు. ఆకల్తో మాడే తనకి అయ్యావార్లు చెప్పే పాఠాలు బుర్రకెక్కవు. అయినా బియ్యం కోసవే బడికెడుతుంది తను. ఆ మూడు కేజీల బియ్యం కూడా రావడంలేదు. ఈరోజైనా టైంకి వెళ్ళాలనుకుంది. ఈ లంకంత కొంపా, గదులూ, తడిగుడ్డా తనని మింగేసే పావుల్లా కనిపిస్తాయి... ఇప్పుడైనా పరిగెత్తితే టైంకి చేరుకోగలదు... పరిగెత్తితే... పరు...

"యేవే దుర్గీ! తడిగుడ్డ పెట్టడం అయితే ఈ బియ్యం పురుగుల్లేకుండా యేరు. సాయంత్రం నూకాడించాలి." రైలింజను అరుపు విన్పించింది డైనింగ్ హాల్లోంచి. దుర్గ నిట్టూరుస్తూ బరువైన బియ్యం చేట దొడ్లోకి తీసుకొచ్చి కూర్చుంది. సీతాలు అత్తాకోడళ్ళు విడిచిన భారీ గుడారాల్లాంటి చీరలు ఉతుకుతోంది. సీతాలు ఆయాసపు నిట్టూర్పులు బట్టలు ఉతుకుడు చప్పుడులో కలిసిపోతున్నాయి. అనాసక్తంగా బియ్యం కదుపుతూన్న దుర్గ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. అటూ యిటూ చూసి మెల్లిగా తల్లిని పిల్చింది.

"ఇయి ఆ బియ్యవే!" లో గోంతుతో చెప్పింది రహస్యం చెప్తున్నట్టు.

"యే బియ్యవే?" సీతాలు కర్థం కాలేదు.

"అయ్యేనే, మా యిస్కూలు బియ్యం! ఇయి అయ్యే పురుగులు!" ఓ లావుగా వున్న పురుగుని చూపిస్తూ చెప్పింది దుర్గ దానివంక అసహ్యంగా చూస్తూ.

# మనిషిజాడ

–'లయా' రామకృష్ణ



**అ**తనొక సెలయేరు
జతకట్టి రాళ్ళతో
గలగలలాడతాడు

అతనొక ఆకాశం
అంత ఎత్తు నుంచి చూస్తాడు
శూన్యాన్ని

అతనొక అంగుష్టం
అన్ని దిక్కులనూ
నొక్కుతాడు

అతనొక తెరబొమ్మ
అభినయిస్తాడు
దేవతల్లాగే

వీరికోసం నేను
వెదకడం లేదు
వెర్రిగా

అసలు మనిషి కోసం
అన్వేషణ
స్వతంత్రదేశంలో